సాక్షి
కర్నూలు
శనివారం । 9 । సెప్టెంబర్ । 2023



ఉమ్మడి జిల్లాకు వర్ష సూచన

ఎమ్మిగనూరురూరల్: ఉమ్మడి జిల్లాలో శనివారం నుంచి ఈనెల 13 వరకు ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని బనవాసి కేవీకే వాతావరణ విభాగం శాస్త్రవేత్త మహదేవయ్య తెలిపారు.



వరలక్ష్మీ.. కటాక్షించు!

శ్రీశైలంటెంపుల్: శ్రావణ నాల్గవ శుక్రవారం శ్రీశైల దేవస్థానంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలను వైభవంగా నిర్వహించారు. వ్రతాల్లో చెంచు ముత్తైదువులు పాల్గొన్నారు.



పంటలను కాపాడేలా..!

జలాశయాల్లో నీటిని జాగ్రత్తగా వాడుకుంటూ ఖరీఫ్ పంటలను కాపాడేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వచ్చే వారంలో మరోసారి ఐఏబీ సమావేశాన్ని నిర్వహించనున్నారు. IIలో▸

న్యూస్‌రీల్

శ్రీమఠంలో గుంతకల్లు రైల్వే డీఆర్‌ఎం



ప్రదక్షిణలు చేస్తున్న డీఆర్‌ఎం మనీష్‌అగర్వాల్

మంత్రాలయం: గుంతకల్లు రైల్వే డీఆర్‌ఎం మనీష్ అగర్వాల్ శుక్రవారం మంత్రాలయం వచ్చారు. గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామి మూలబృందావనాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు తుంగభద్ర రైల్వే స్టేషన్‌ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈయనతో పాటు వైఎస్సార్‌సీపీ నేత వై.ప్రదీప్‌రెడ్డి, సీనియర్ డీఈఎన్ కో ఆర్డినేషన్ అంకిరెడ్డి, సీనియర్ డీఈఈ టీఆర్డీ సురేంద్ర, రైల్వే అధికారులు, స్థానిక నాయకులు ఉన్నారు.

65.27 శాతం పంటల నమోదు పూర్తి

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో ఖరీఫ్ పంటల ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. పంటల నమోదుతో పాటు వీఏఏ, వీఆర్‌ఓ అథెంటికేషన్, రైతుల ఈ-కేవైసీ చేయించే ప్రక్రియ కూడా ఊపందుకుంది. ఖరీఫ్ సాధారణ సాగు 10,42,537 ఎకరాలు ఉండగా 8 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఇప్పటి వరకు ఈ-క్రాప్‌లో 5,22,376 ఎకరాలు నమోదు చేశారు. 65.27 శాతం పంటల నమోదు పూర్తయింది. 49.09 శాతం వీఏఏల బయోమెట్రిక్ అథెంటికేషన్, వీఆర్‌ఓల బయోమెట్రిక్ అథెంటికేషన్ 35.2 శాతం పూర్తి కాగా.. 3,264 మంది రైతులు 10,476 ఎకరాలకు ఈ-కేవైసీ చేయించుకున్నారు.

11 నుంచి కలెక్టరేట్‌లోనే స్పందన

కర్నూలు(సెంట్రల్): ఈనెల 11 నుంచి కలెక్టరేట్‌లోనే స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి కలెక్టర్ నారపురెడ్డి మౌర్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సునయన ఆడిటోరియం పునరుద్ధరణ పనులు జరుగుతుండడంతో నాలుగు వారాలుగా జెడ్పీ సమావేశ మందిరంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. అయితే కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ఆధునీకరణ పనులు పూర్తి కావడంతో తిరిగి ఇక్కడే స్పందన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. అందులో భాగంగా ఈ సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులోనే స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని.. ప్రజలు తమ సమస్యలపై వినతులను అందజేయవచ్చని పేర్కొన్నారు.

అడవుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

- కర్నూలు సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ పి.రామకృష్ణ



సమీక్ష నిర్వహిస్తున్న రామకృష్ణ

కర్నూలు కల్చరల్: అడవుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను అటవీ శాఖ కర్నూలు సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ పి.రామకృష్ణ ఆదేశించారు. శుక్రవారం సర్కిల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో టెరిటోరియల్, సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌ఓలతో సమీక్ష నిర్వహించారు. ఈనెల చివరిలోగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. నగర వనాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. ఎర్రచందనం కేసులకు సంబంధించి చార్జ్‌షీట్లు పూర్తి చేయాలన్నారు. కర్నూలు, కడప డీఎఫ్‌ఓలు శివశంకర్‌రెడ్డి, సందీప్ రెడ్డి, కడప, నంద్యాల సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌ఓలు నాగార్జునరెడ్డి, బి. వెంకటేశ్వర రావు, ఫ్లైయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌ఓ గురుప్రభాకర్, ప్రొద్దుటూరు సబ్ డివిజన్ డీఎఫ్‌ఓ దివాకర్ సమీక్షలో పాల్గొన్నారు.

శ్రీశైలంలో 88.5 టీఎంసీల నీరు నిల్వ

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయంలో శుక్రవారం సాయంత్రానికి 88.4734 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాం నీటిమట్టం 853.70 అడుగులకు చేరుకుంది. ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి 29,655 క్యూసెక్కుల నీరు డ్యాంకు వచ్చి చేరుతుంది. జూరాలలో విద్యుత్ ఉత్పత్తి అనంతరం 23,045 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 6,610 క్యూసెక్కుల నీరు జలాశయానికి వచ్చి చేరుతుంది. గురువారం నుంచి శుక్రవారం వరకు జలాశయం నుంచి హంద్రీనీవా సుజల స్రవంతికి 1,403 క్యూసెక్కులు, పోతిరెడ్డి పాడు హెడ్ రెగ్యులేటరీ ద్వారా 1,750 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 1,466 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

పుడమి తానాలాడితే.. అదృష్టం వజ్రమయ్యేను!

మొదలైన వజ్రాన్వేషణ

- సుదూర ప్రాంతాల నుంచి వరుసకట్టిన ఆశావహులు
- ఈ ఏడాది ఇప్పటి వరకు 8 వజ్రాలు లభ్యం
- ఏటా బయటపడుతున్న 40-50 వజ్రాలు
- కొనుగోలు చేస్తున్న స్థానిక వ్యాపారులు
- పోటీ పెరిగితే వేలం పాట నిర్వహణ
- డబ్బుతో పాటు బంగారం ఇచ్చి కొనుగోలు

వర్షాలు కురిస్తే చాలు వజ్రాన్వేషణ మొదలవుతోంది. పొలాల్లో పంటలు పండటం పక్కన పెడితే.. వజ్రాలను వెతికేందుకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలతో ఈ ప్రాంతం జాతరను తలపిస్తుంది. అనంతపురం, కడప, చిత్తూరు, గుంటూరు, కృష్ణా జిల్లాల నుంచి కూడా తమ అదృష్టం పరీక్షించుకునేందుకు ఇక్కడ మకాం వేయడం పరిపాటిగా మారింది. కళ్లలో మెరుపు వస్తే లక్షలు మూటకట్టుకొని వెళ్తున్నారు.. లేదంటే ఇక్కడే పొలాల్లో కాలం గడుస్తోంది.



తుగ్గలి మండలం జొన్నగిరి సమీపంలోని పొలాల్లో వజ్రాల కోసం వెతుకులాట

సాక్షి ప్రతినిధి కర్నూలు: ఈ ఏడాది అధికమాసం కావడంతో వర్షాల రాక ఆలస్యమైంది. జూన్‌లో తొలకరి జల్లులు పడినా.. ఆ తర్వాత వరుణుడు కాస్త ముఖం చాటేశాడు. తిరిగి ఆగస్టులో మంచి వర్షం కురవడంతో వజ్రాన్వేషణ మొదలైంది. గతేడాది నుంచి కర్నూలు, నంద్యాల జిల్లాలతో పాటు ఇతర జిల్లాల వారు ఇక్కడ తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ఇక్కడ వాలిపోతున్నారు. తుగ్గలి, మద్దికెర మండలాల్లో ఏటా జూన్, జులై మాసాల్లో వజ్రాల వేట ముమ్మరంగా సాగుతుంది. దొరికిన వజ్రాలు కొనుగోలు చేసేందుకు గుత్తి, గుంతకల్లు, జొన్నగిరి, పెరవలిలో వ్యాపారులు ఉన్నారు. వీరు గ్రామాల్లో కొందరు ఏజెంట్లను నియమించుకున్నారు. వజ్రం దొరికిందనే సమాచారం రాగానే ఏజెంట్లు వారి వద్ద వాలిపోతారు. వజ్రం దొరికిన వారిని వ్యాపారులు వద్దకు తీసుకెళ్లి రేటు కుదురుస్తారు. వజ్రం బాగా విలువైంది అయితే వ్యాపారులే వారి వద్దకు వెళ్తారు. వ్యాపారుల మధ్య పోటీ పెరిగితే బహిరంగ వేలం వేస్తారు. గతంలో వేల నుంచి రూ.20 లక్షల వరకు వజ్రాలు కొనుగోలు చేశారు. ఈ ఏడాది ఇప్పటికే 8 వజ్రాలు లభ్యమయ్యాయి. ఇక్కడ వజ్రాలను స్థానిక వ్యాపారులకే విక్రయిస్తారు. అంతలా ఇక్కడి వ్యాపారులు నమ్మకం సంపాదించారు. చెప్పిన ధరకు సంబంధించిన డబ్బు వ్యాపారుల వద్దనే ఉంచితే వడ్డీ సహా చెల్లిస్తారు. అదే ప్రభుత్వ అధికారులకు సమాచారం ఇస్తే దానిని స్వాధీనం చేసుకుని పైసా కూడా రాదనే అభిప్రాయంతో వారు అధికారులకు చెప్పకుండా విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది.

గతేడాది

తుగ్గలి మండలం జొన్నగిరికి చెందిన ఓ రైతుకు అదృష్టం తలుపు తట్టింది. తన పొలంలో పని చేస్తుంటే ఓ రాయి తళుక్కున మెరిసింది. అది వజ్రమని నిర్ధారణ కావడంతో ఓ వ్యాపారి రూ.1.25 కోట్లకు సొంతం చేసుకున్నాడు. ఇది సుమారు 30 క్యారెట్లు ఉంటుందని సమాచారం. ఇప్పటివరకు లభించిన వజ్రాల్లో ఇదే అత్యంత విలువైనదిగా చెబుతున్నారు.



వజ్రాలు లభ్యమయ్యే ప్రాంతాలు ఇవే..

కర్నూలు, అనంతపురం జిల్లాల సరిహద్దుల్లో వజ్రాల నిక్షేపాలు ఉన్నాయనే విషయాన్ని జీఎస్ఐ(జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా) గుర్తించింది.

- తుగ్గలి, మద్దికెర మండలాల్లోని తుగ్గలి, జొన్నగిరి, పగిడిరాయి, కొత్తపల్లి, పెరవలి, అగ్రహారం, హంప, యడవలి, మద్దికెర ప్రాంతాల్లో వజ్రాలు లభ్యమవుతున్నాయి.
- అనంతపురం జిల్లాలోని వజ్రకరూరు మండలంలో గంజికుంట, తట్రకల్లు, రాగులపాడు, పొట్టిపాడు, కమలపాడు, గూళపాళ్యం, ఎన్.ఎంపీ.తండాలో వజ్రాల జాడ ఉంది.
- వజ్రకూరు, తుగ్గలి, మద్దికెరలో 50-60 కిలోమీటర్ల సరిహద్దులో వజ్రనిక్షేపాలను గుర్తించారు.
- ఈ ప్రాంతంలో కింబర్ లైట్ పైప్‌లైన్ ఉందని గనులు, భూగర్భ శాఖ నిర్ధారించింది.
- వజ్రాలు, బంగారు నిక్షేపాలపై గత కొన్నేళ్లుగా పరిశోధన జరుగుతుంది.
- విదేశీ సంస్థలు కూడా ఇక్కడ నిక్షేపాలపై పరిశోధన చేయడం విశేషం.

చాలా దేశాలతో పోలిస్తే నాణ్యమైన వజ్రాలు

వజ్రాల మైనింగ్ కోసం వజ్రకరూర్‌లో వజ్రాల ప్రక్రమణ కేంద్రాన్ని 1969లో ఏర్పాటు చేశారు. అయితే వజ్రాన్వేషణపై ఇది పెద్దగా దృష్టి సారించలేదు. ఆ తర్వాత ఓ ఆస్ట్రేలియన్ కంపెనీ వచ్చి కొద్దికాలం పాటు సర్వే చేసి తిరిగి వెళ్లింది. ఆఫ్రికాతో పాటు చాలా దేశాలతో పోలిస్తే ఇక్కడి వజ్రాలు చాలా నాణ్యమైనవి, విలువైనవి. అందుకే దీని వెలికితీతపై ప్రత్యేక దృష్టి సారిస్తే, మన దేశంలోని వజ్రాలకు ప్రపంచ మార్కెట్‌లో చాలా విలువ ఉంటుందనేది నిపుణుల అభిప్రాయం.

విదేశాల్లో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు

ఆఫ్రికా, అంగోలా, కాంగోతో పాటు చాలా దేశాల్లో ఇదే తరహాలో వజ్రాలు లభిస్తాయి. వాటిని అల్యూవియల్ డైమండ్స్ అంటారు. అక్కడ ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తుంది. వజ్రాలు లభించిన వారు నేరుగా ఆ కేంద్రానికి వచ్చి చూపిస్తారు. వజ్రాల నాణ్యత ఆధారంగా కొంత మొత్తం చెల్లిస్తారు. వజ్రాలను లీగల్‌గా ప్రభుత్వం ప్రక్రియను పూర్తి చేసి విక్రయిస్తుంది. కర్నూలు జిల్లాలో ఏటా సగటున 50-60 వజ్రాలు లభిస్తున్నాయి. అలాగే వజ్రకరూరు ప్రాంతంలో కూడా ఏటా 30-40 వజ్రాలు బయటపడుతున్నాయి. అంటే ఈ రెండు జిల్లాల్లో ఏటా వంద వజ్రాలు లభిస్తున్నాయి. మైనింగ్ చేస్తే వందల కోట్ల విలువైన సంపద ప్రభుత్వానికి లభించే అవకాశం ఉంది.



వజ్రాలు ఎలా లభ్యమవుతాయంటే..

మన దేశంలో డైమండ్‌మైనింగ్ మధ్యప్రదేశ్‌లోని పన్నాలో ఉంది. అక్కడ భూమిలోని రాళ్లు తవ్వితీసి వజ్రాల తయారీ ప్రక్రియ చేస్తారు. కానీ వజ్రకరూర్, తుగ్గలి, జొన్నగిరిలో మాత్రం రాళ్లు ఉన్నాయి. ఇవి 150 మీటర్ల లోతులో ఉంటాయి. అయితే భూమిలో కొన్ని వాతావరణ మార్పులు జరిగినప్పుడు అవి బయటకు వస్తాయి. ఆ తర్వాత వెదరింగ్(వికోశీకరణ) వల్ల అంటే ఎండకు ఎండి, వర్షానికి తడిచి పగిలిపోతాయి. అప్పుడు వర్షాలు, వరదలు వచ్చినప్పుడు ఆ రాళ్ల ముక్కలు పొలాల్లో అక్కడక్కడ నిలుస్తున్నాయి. ఇంకొన్ని వాగులు, వంకల ద్వారా ఇతర ప్రాంతాలకు కూడా చేరతాయి. అలా చెల్లాచెదురైన వజ్రాలే ఇప్పుడు రెండు జిల్లాలలో లభిస్తున్నాయి.

ఈ ఏడాది లభించిన వజ్రాల వివరాలు

- **మే 27:** చిన్నగిరిలో ఓ వ్యక్తికి వజ్రం దొరికింది. దీన్ని రూ.3.03లక్షలకు విక్రయించారు.
- **జూన్11:** జొన్నగిరిలో ఓ రైతుకు వజ్రం లభిస్తే దాన్ని రూ.30వేలకు విక్రయించారు.
- **జూన్ 26:** రామాపురంలో లభించిన వజ్రాన్ని ఓ వ్యక్తి రూ.1.30లక్షలకు విక్రయించారు.
- **జూలై 23:** జి.ఎర్రగుడిలో వజ్రం లభించింది. అయితే దాన్ని ఇప్పటి వరకూ విక్రయించలేదు.
- **ఆగస్టు 31:** జొన్నగిరిలో ఓ రైతుకు వజ్రం లభిస్తే రూ.40వేలకు అమ్మేశారు.
- **సెప్టెంబర్ 2:** గిరిగెట్లలో దొరికిన వజ్రాన్ని రూ.2లక్షల నగదు, రెండు తులాల బంగారానికి విక్రయించారు. అదే రోజు జొన్నగిరిలో ఓ వజ్రాన్ని రూ.40వేల నగదు, జత బంగారు కమ్మలకు ఓ వ్యాపారి కొనుగోలు చేశాడు.
- **సెప్టెంబర్ 6:** పీ.కొత్తూరులో కలుపు తీస్తున్న మహిళా కూలీకి వజ్రం లభ్యమైంది. గురువారం అనంతపురం జిల్లా గుత్తికి చెందిన ఓ వ్యాపారి టెండర్‌లో రూ.72 వేలకు కొనుగోలు చేశాడు.

వజ్రాలు దొరుకుతాయంటే వచ్చా



మాది కదిరి దగ్గర మొలకల చెరువు. ఇక్కడ వజ్రాలు దొరుకుతాయంటే ఏడుగురు గుంపుగా కలిసి వచ్చాం. పొలాల్లో విత్తనం వేశారు. రైతులు పొలాల్లోకి రానీయడం లేదు. పంట లేని పొలాల్లో తిరుగుతున్నాం. ఇంత దూరం వచ్చాక వెనక్కి వెళ్లలేక సాగు చేసిన పొలాల్లో కూడా పంట లేని చోట వెతుకుతున్నాం. వజ్రం ఎలా ఉంటుందో కూడా నేను చూడలేదు.

– మహబూబ్‌బీ, మొలకల చెరువు, అనంతపురం జిల్లా

రెండేళ్ల నుంచి వస్తున్నా



టీవీల్లో, వాట్సాప్‌ల్లో వారంలో మూడు వజ్రాలు.. ఒక్కరోజే రెండు వజ్రాలు లభించాయని చూశాం. నేను మూడు రోజుల కిందట వజ్రాల కోసం వచ్చా. రెండేళ్ల నుంచి వస్తూనే ఉన్నా. అందరూ జొన్నగిరిలోని ఓ పొలంలో ఎక్కువ వజ్రాలు దొరుకుతాయంటారు. రైతులు పొలాల్లో తిరగనీయకుండా తరుముతున్నారు. హోటళ్లో తింటూ రాత్రిపూట ఏదో ఒక చోట తలదాచుకుంటాం.

– శీను, పెండ్లిమర్రి, వైఎస్సార్ కడప జిల్లా

గడువులోపు అబాడీ సర్వే పూర్తి చేయాలి


- వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులను ఆదేశించిన ఇన్‌చార్జ్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య



మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ మౌర్య

కర్నూలు(సెంట్రల్): నిర్దేశిత గడువులోపు అబాడీ(గ్రామకంఠాలు)సర్వేను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఇన్‌చార్జి కలెక్టర్ నారపురెడ్డి మౌర్య ఆదేశించారు. ఈ సర్వేకు సంబంధించి గ్రౌండ్ ట్రూతింగ్, వాల్యుయేషన్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఈఓఆర్‌డీలకు సూచించారు. శుక్రవారం ఆమె కలెక్టరేట్ నుంచి వివిధ అభివృద్ధి పనులపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండలాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..స్వమిత్ర ఈకేవైసీకి సంబంధించి కొన్ని మండలాల్లో పురోగతి కనిపించడంలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. పీఎం కిసాన్ అనర్హుల జాబితా మరోసారి పరిశీలన చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న మ్యూటేషన్, ఆధార్ సీడింగ్‌లను సాయంత్రం లోపు పూర్తి చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. ఆధార్ సీడింగ్‌లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న హొళగుంద తహసీల్దార్‌కు షోకాజ్ నోటీసు ఇవ్వాలని డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావును ఆదేశించారు. కొతాళం, గూడూరు, సీ బెళగల్, కల్లూరు, ఆలూరు మండలాల్లో 50 శాతంకంటే తక్కువగా ఈ క్రాప్ నమోదు చేశారన్నారు. సెప్టెంబర్ 15వ తేదీ నాటికి నూరు శాతం ఈ క్రాప్ బుకింగ్ పూర్తి కావాలన్నారు. రీసర్వేకు సంబంధించి మూడో విడతకు ఎంపిక చేసిన గ్రామాల్లో వెంటనే గ్రౌండ్ ట్రూతింగ్ పనులను మొదలు పెట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ భూములు పొందిన లబ్ధిదారుల వివరాలను త్వరగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. కర్నూలు, ఆదోనిలో లీగల్ మెట్రాలజీ శాఖ కార్యాలయాలకు, కోసిగిలో ట్రాన్స్‌కోకు అనువైన స్థలాలను గుర్తించి నివేదించాలని సంబంధిత తహసీల్దార్లను ఆదేశించారు. కార్యక్రమంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్‌రెడ్డి, రమణకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

కర్నూలులో పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్



జిల్లా పోలీసు అధికారులతో చర్చిస్తున్న అడిషనల్ డీజీ అతుల్ సింగ్

కర్నూలు: కర్నూలు రేంజ్ పరిధిలో ఎస్‌ఐ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షల పరిశీలనకు ఆంధ్రప్రదేశ్ పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్, అడిషనల్ డీజీ అతుల్ సింగ్ శుక్రవారం సాయంత్రం కర్నూలు ఏపీఎస్పీ రెండో బెటాలియన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా పలువురు పోలీసు అధికారులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఏపీఎస్పీ రెండో బెటాలియన్‌లో కొనసాగుతున్న ఎస్‌ఐ అభ్యర్థుల ఎంపికకు సంబంధించిన ఏర్పాట్ల గురించి జిల్లా పోలీసు అధికారులతో కాసేపు సమీక్ష నిర్వహించారు. కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్‌కుమార్, ఎస్పీ కృష్ణకాంత్, సెబ్ అడిషనల్ ఎస్పీ కృష్ణకాంత్ పటేల్, ఏపీఎస్పీ రేంజ్ బెటాలియన్స్ డీఐజీ సీహెచ్ వెంకటేశ్వర్లు, కమాండెంట్ రవిశంకర్, తదితరులతో అతుల్‌సింగ్ సమావేశమై చర్చించారు.

కోర్టు ప్రాంగణాల్లో పటిష్ట భద్రత



కోర్టు ఆవరణలో భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న న్యాయమూర్తులు, ఎస్పీ

కర్నూలు: కోర్టు ప్రాంగణాల్లో భద్రతను పటిష్టం చేస్తున్నారు. ఇందుకోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే గస్తీ పెంచి, సెక్యూరిటీ రూమ్స్, ప్రవేశ, నిష్క్రమణ గేట్లు ఏర్పాటు చేయనున్నారు. పార్కింగ్ ప్రదేశాలపై కూడా నిఘా ఉంచనున్నారు. ఇందులో భాగంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీనివాసరావు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకట నాగశ్రీనివాసరావు, ఎస్పీ కృష్ణకాంత్ తదితరులు శుక్రవారం సాయంత్రం జిల్లా కోర్టుతో పాటు జేఎఫ్‌సీఎం కాంప్లెక్స్ ప్రాంగణంలో భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. సౌకర్యాల గురించి ఈ సందర్భంగా వారు చర్చించారు. పలు అంశాలపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. వారి వెంట ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి పఠాన్ షియాజ్ ఖాన్, స్పెషల్ బ్రాంచ్ సీఐ ప్రసాద్, కోర్టు మానిటరింగ్ సీఐ రామయ్య నాయుడు, టూటౌన్ సీఐ శ్రీనివాసులు, ఏఆర్ ఆర్‌ఐ రమణ, ఎస్‌ఐ ఖాజావలి ఉన్నారు.

బాబూ.. సానుభూతి డ్రామాలొద్దు!

- నీవు నిజంగా నిప్పు అయితే ఐటీ నోటీసులకు సమాధానం చెప్పు
- తప్పు చేస్తే ఎవరినైనా చట్టం ప్రకారం అరెస్టు చేస్తారు
- అమరావతి నిర్మాణాల కాంట్రాక్ట్‌లో అవినీతి జరిగిందని ఆనాడే వైఎస్ జగన్ చెప్పారు
- చంద్రబాబు అవినీతి పవన్, పురంధేశ్వరికి కనిపించడం లేదా?
- విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు బీవై రామయ్య, కాటసాని రాంభూపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న బీవై రామయ్య, చిత్రంలో కాటసాని రాంభూపాల్ రెడ్డి తదితరులు

కర్నూలు(సెంట్రల్): ఐటీ శాఖ కుంభకోణంలో తనను అరెస్టు చేస్తారంటూ టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సానుభూతి డ్రామా ఆడుతున్నారని వైఎస్సార్‌సీపీ కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు బీవై రామయ్య, కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. తాను నిప్పునని, స్వచ్ఛమైన వ్యక్తినని, అవినీతి మరకలేని నాయకుడి అని పదేపదే వల్లిస్తున్న చంద్రబాబు.. రూ.118 కోట్లకు సంబంధించిన లెక్కలు చెబితే ప్రజలకు వాస్తవాలు తెలుస్తాయన్నారు. కర్నూలులోని పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ముందుగా పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు, కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రత్యక్షంగా రూ.50 లక్షలతో దొరికిన చంద్రబాబు, అక్కడి నుంచి వచ్చి అమరావతి కరకట్టపై పంచాయితీ పెట్టారన్నారు. అమరావతి నిర్మాణ సంస్థల నుంచి తన పీఏ శ్రీనివాస్ ద్వారా చంద్రబాబు అక్రమాస్తి పొందారన్నారు. ఈ విషయం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విచారణ చేస్తే వెలుగులోకి రాలేదని, ఇన్‌కం ట్యాక్స్ డిపార్టుమెంట్ చేసిన విచారణలో తేలిందన్నారు. ఆ శాఖ ఇచ్చిన నోటీసులకు సమాధానం చెప్పకుండా తనను అరెస్టు చేయబోతున్నారంటూ డ్రామాలు ఆడటం తగదన్నారు. తప్పు చేసిన వారిని అరెస్టు చేయకపోతే ఏమి చేస్తారని ప్రశ్నించారు. అమరావతి తాత్కాలిక భవన నిర్మాణాల్లో అవినీతి జరిగిందని తమ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆనాడే చెప్పారన్నారు. చంద్రబాబు అవినీతి జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌కు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరికి కనిపించకపోవడం శోచనీయమన్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ లోకేష్ పాదయాత్ర చేస్తున్నారని, భీమవరంలో కిరాయి గూండాలను పెట్టుకొని సృష్టించిన బీభత్సంలో పోలీసులు గాయపడ్డారన్నారు. పాదయాత్ర ఇలా చేస్తే ప్రజా సమస్యలు ఎలా తెలుస్తాయని ప్రశ్నించారు.

ఐటీ నోటీసులకు సమాధానం చెప్పాలి

వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసానిరాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్ని కుంభకోణాలు చేసినా తనను పట్టుకోలేరన్న ధీమాలో చంద్రబాబునాయుడు ఉన్నారన్నారు. తప్పులు చేసుకుంటూ పోతే ఎక్కడో ఒక చోట పట్టుబడక తప్పదన్నారు. ఐటీ స్కాంలో దొరికి.. అధికార పార్టీపై నిందలు వేయడం తగదన్నారు. చంద్రబాబుకు దమ్మూధైర్యం ఉంటే ఐటీ నోటీసులకు సమాధానం చెప్పాలన్నారు. చంద్రబాబు, లోకేష్, పవన్ కల్యాణ్ తోపాటు కిందిస్థాయి టీడీపీ నాయకులు కూడా రెచ్చిపోయి మాట్లాడుతున్నారని, వారికి సమాధానంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తిరగబడితే ఏమి జరుగుతుందో వారే ఊహించుకోవాలన్నారు. కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఐటీ నోటీసులకు సమాధానం చెబితే చంద్రబాబునాయుడు జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి, కార్పొరేటర్ శ్వేతారెడ్డి, నాయకులు సీహెచ్ మద్దయ్య, అనంతరెడ్డి, గోపాల్‌రెడ్డి, డీకే రాజశేఖర్, ధనుంజాయాచారి, సత్యంయాదవ్, లక్ష్మీకాంతం, సందెపోగు శివ, యూనస్ తదితరులు పాల్గొన్నారు.

'సుంకేసుల'కు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో



గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఎగువ నుంచి రిజర్వాయర్‌కు 8,730 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ఒక గేటును మీటర్ మేర, ఒక గేటును అర మీటర్ మేర ఎత్తి 6,610 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. కేసీ కాల్వకు 1,616 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. డ్యాం పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 1.20 టీఎంసీలు కాగా ప్రస్తుతం 1.110 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

రూ.1,137 కోట్లతో 568 ఆర్‌ఐడీఎఫ్ ప్రాజెక్టులు

- నాబార్డు జనరల్ మేనేజర్ జయకన్నన్



మాట్లాడుతున్న నాబార్డు జీఎం జయకన్నన్

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో రూ.1,137 కోట్ల విలువైన 568 ఆర్‌ఐడీఎఫ్ (రూరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్) ప్రాజెక్టులు కొనసాగుతున్నాయని నాబార్డు జనరల్ మేనేజర్ జయకన్నన్ తెలిపారు. ఇప్పటి వరకు మంజూరు చేసిన ప్రాజెక్టులను సత్వరం పూర్తి చేయడంతో పాటు కొత్త వాటికి డీపీఆర్(డీటైల్ ప్రాజెక్టు రిపోర్టు)లు సిద్ధం చేయాలని సూచించారు. నాబార్డు ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ కార్యాలయం(ఏపీఆర్‌వో) ఆధ్వర్యంలో శుక్రవారం రాయలసీమ జిల్లాలు, ప్రకాశం జిల్లాకు చెందిన 16 ప్రభుత్వ శాఖల అధికారులతో కర్నూలులో జోనల్‌స్థాయి వర్క్‌షాపు నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో నాబార్డు జనరల్ మేనేజర్ మాట్లాడుతూ.. రాయలసీమతో పాటు ప్రకాశం జిల్లాలో ఆర్‌ఐడీఎఫ్ ప్రాజెక్టులు 3,000 వరకు ఉన్నాయన్నారు. భూసేకరణ వంటి సమస్యలు ఉంటే తమ దృష్టికి తెస్తే జిల్లా కలెక్టర్ల ద్వారా పరిష్కరిస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఆర్‌ఐడీఎఫ్ ప్రాజెక్టులు ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. ఏపీఆర్‌వో డిప్యూటీ జనరల్ మేనేజర్ దిని సురేష్ పాణికర్, ఉమ్మడి కర్నూలు జిల్లా నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. నాడు-నేడు కింద పాఠశాలల అభివృద్ధి, వైద్య కళాశాలలు, రోడ్లు, పశువైద్యశాలలు, అంగన్‌వాడీలు, అగ్రి ఇన్‌ఫ్రాల్యాబ్‌లు, తాగునీటి సరఫరాకు సంబంధించిన ప్రాజెక్టులు అమలులో ఉన్నాయన్నారు. అనంతపురం డీడీఎం అనురాధ, వైఎస్ఆర్ జిల్లా డీడీఎం విజయ్‌విహారి, ప్రకాశం జిల్లా డీడీఎం రవికుమార్, ఏపీఆర్‌వో ఏఎం పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రాణం తీసిన విద్యుదాఘాతం

● మేకల మేతకోసం వెళ్లగా దుర్ఘటన


మృతి చెందిన మానికింది ఈరన్న

సి.బెళగల్: మేకల మేతకోసం బసిరి ఆకులు కోయ బోయి విద్యుత్ తీగలు తగిలి ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన పోలకల్ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ పీరయ్య తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలోని బీసీ కాలనీలో నివాసముండే బోయ మానికింది ఈరన్న (22) శుక్రవారం ఉదయం మేకలకు మేత తెచ్చేందుకు ఇంటి సమీపంలోని శ్రీ చెన్న సోమేశ్వరస్వామి ఆలయం ఎదురు కాళ్ల మండపం దగ్గరకు వెళ్లాడు. అక్కడున్న బసిరిచెట్టు ఆకులను కోసుకునే సమయంలో విద్యుత్ తీగలు తగిలాయి. దీంతో ఈరన్న అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోడుమూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి నెలన్నర వయస్సున్న కూతురు, భార్య సుహాసిని ఉన్నారు.

తమిళనాడు వాసులకు గాయాలు


బోల్తా పడిన టెంపో వాహనం

చాగలమర్రి: కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారిపై పెద్దబోధనం గ్రామ సమీపంలో శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో తమిళనాడులో చెన్నైకి చెందిని ఆరుగురికి గాయాలయ్యాయి. వీరు చెన్నై నుంచి అహోబిల దేవస్థానానికి దర్శన నిమిత్తం టెంపో వాహనంలో వస్తుండగా మార్గమధ్యలో పెద్దబోధనం గ్రామ సమీపంలో టైర్ పగిలి డివైడర్‌కు ఢీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వాహనంలో ప్రయాణిస్తున్న కరుణాకర్, మధుసూదన్, గోపాల్, శ్రీధర్, ఘణశ్యాం, డ్రైవర్ కార్తిక్ గాయపడ్డారు. వీరిలో తీవ్రంగా గాయపడ్డ మధుసూదన్, గోపాల్‌లను ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నరసింహ స్వామి దయవల్లే ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడ్డామని భక్తులు చెబుతున్నారు. ఈరకు కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నట్లు చాగలమర్రి పోలీసులు తెలిపారు.

14 నుంచి యువ సాంస్కృతిక పోటీలు


నంద్యాల(న్యూటౌన్): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 14న జిల్లా స్థాయి యువ సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్నట్లు సెట్కూరు సీఈఓ పీవీ రమణ శుక్రవారం తెలిపారు. 15 – 29 సంవత్సరంల్లోపు యువ కళాకారులు జానపద నృత్యాలు, జానపద గీతాలు, స్టోరీ రైటింగ్, పోస్టర్ మేకింగ్, చిత్రలేఖనం, పర్యావరణం, మత్తు పదార్థాల నివారణ, ఆజాదికా అమృత్ మహోత్సవ్‌పై సమాజానికి సందేశం ఇచ్చే విధంగా ప్రదర్శన ఉండాలన్నారు. మొదటి స్థానంలో నిలిచిన విజేతలను రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే యువతీ యువకులు, కళాకారులు తమ పేర్లను https:// bit.ly.nandyaldyf2023 వెబ్ లింక్‌లో నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 8688361250, 9121415234ను సంప్రదించాలన్నారు.


లంబోదరుడికి రంగులు అద్దుతున్న కళాకారులు


ప్రత్యేక శ్రద్ధతో గణేశున్ని తీర్చిదిద్దుతూ..


విగ్రహ తయారీకి మట్టిని కలుపుతున్న దృశ్యం


వేడుకకు వేళాయె...


రూపు దిద్దుకుంటున్న గణనాథుడు


మట్టి గణపయ్య.. దీవించ రావయ్య!

వినాయక చవితి.. ప్రకృతితో ముడిపడిన పండుగ. ఈ నెల 18వ తేదీ నుంచి గణేశ్ ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. గతంలో ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలను మండపాల్లో కొలువుంచేవారు. పర్యావరణానికి హాని కలుగుతుండటంతో వాటి స్థానంలో మట్టి వినాయక ప్రతిమలు ఏర్పాటుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. ప్రజల అభీష్టం మేరకు కర్నూలు నగర శివారులోని వెంగన్న బావి సమీపంలో కోల్‌కత్తాకు చెందిన కళాకారులు ఆరు నెలల నుంచి మట్టి విగ్రహాలను తయారు చేస్తున్నారు. తుది మెరుగులు దిద్దుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు


తుది మెరుగులు దిద్దుకుంటూ..


విక్రయానికి సిద్ధంగా ఉంచిన మట్టి గణనాథులు


పూజకు సిద్ధమైన శివుని కుమారుడు..

స్కూలు బస్సు ఢీకొని బాలుడి మృతి


గగన్ విహారి (ఫైల్)

కల్లూరు: నగర శివారులోని డోన్ రహదారిలో ఉన్న తిరుమలగిరి కాలనీలో శుక్రవారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో మూడున్నరేళ్ల బాలుడు దుర్మరణం చెందాడు. స్కూల్ నుంచే వచ్చే అన్నను చూసేందుకు వెళ్లిన తమ్ముడు ప్రమాదవశాత్తు స్కూల్ బస్సు కింద పడి మృత్యువాత పడ్డాడు. ఉలిందకొండ ఎస్ఐ నల్లప్ప తెలిపిన వివరాల మేరకు.. తిరుమలగిరిలో నివాసం ఉంటున్న టిఎస్.పుష్పావతి, కిరణ్ కుమార్ దంపతులకు ఇద్దరు కుమారులు (జానకిరాముడు, గగన విహారి) ఉన్నారు. కిరణ్‌కుమార్ హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ బ్యాంక్‌లో మేనేజర్‌గా పని చేస్తున్నాడు. జానకిరాముడు కర్నూలులోని ఓరియన్ పాఠశాలలో చదువుతున్నాడు. సాయంత్రం స్కూల్ బస్సు రావడంతో అన్న కోసం గగన విహారి పరుగెత్తుకుంటూ ఎదురెళ్లాడు. కాలనీ విద్యార్థులు బస్సు నుంచి కిందకు దిగిన తర్వాత డ్రైవర్ రామచంద్రుడు బస్సును ముందుకు కదిలించాడు. అదే సమయంలో కుడి వైపున గగన విహారి ఎడమ వైపు వెళ్లేందుకు పరిగెత్తడంతో బస్సు ఢీకొని టైరు బాలుడి తలపై వెళ్లింది. తీవ్రంగా గాయపడిన బాలుడిని కుటుంబీకులు, స్థానికులు కర్నూలు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. చిన్నారి మృతితో కాలనీలో విషాదం అలుముకుంది. బాలుడి తల్లి పుష్పావతి ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యం మత్తులో రైల్వేట్రాక్‌పై నిద్రించి..

బొమ్మలసత్రం: మద్యం మత్తులో ఇంటి వెనుక ఉన్న రైల్వేట్రాక్‌పై నిద్రించిన ఓ వ్యక్తి తెల్లారేసరికి శవమై కనిపించాడు. నంద్యాల రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని నూనెపల్లి సమీపంలో నివాసముంటున్న సాలయ్య (29) కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. గురువారం రాత్రి మద్యం సేవించి మత్తులో ఇంటి సమీపంలోని రైల్వే ట్రాక్‌పై పడుకున్నాడు. శుక్రవారం వేకువజామున గుర్తుతెలియని రైలు అతనిపై వెళ్లడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మృతుడికి తల్లి పద్మావతమ్మ, భార్య, కుమార్తె ఉన్నారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బీజేపీ నూతన అధ్యక్షుల నియామకం

కర్నూలు కల్చరల్: భారతీయ జనతా పార్టీ(బీజేపీ) కర్నూలు, నంద్యాల జిల్లాలకు నూతన అధ్యక్షులను నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురంధేశ్వరి ఆదేశాలు జారీ చేశారు. కర్నూలు జిల్లా అధ్యక్షుడు రామస్వామి స్థానంలో నూతన అధ్యక్షులుగా కునిగిరి నీలకంఠ, నంద్యాల జిల్లాకు బుడ్డా శ్రీకాంత్‌రెడ్డి స్థానంలో నూతనంగా డాక్టర్ బైరెడ్డి శబరి నియమితులయ్యారు.

అక్రమంగా నాపరాయి తవ్వకాలు జరిపితే చర్యలు

కర్నూలు (న్యూసిటీ): అక్రమంగా నాపరాయి తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ హెచ్చరించారు. బేతంచెర్ల మండలంలోని గోర్లగుంట గ్రామంలో జయజ్యోతి సిమెంట్ ఫ్యాక్టరీకి కేటాయించిన ప్రాంతంలో కొందరు అక్రమంగా నాపరాయి తవ్వకాలు జరుపుతున్నారని ఫ్యాక్టరీ యజమాన్యం ఫిర్యాదు చేసింది. దీంతో ఆయన శుక్రవారం ఆ గ్రామానికి వెళ్లి తనిఖీ చేయగా ఆ ప్రాంతంలో అనుమతులు లేకుండా కురువ మద్దయ్య, సాలమ్మ, నరసింహారెడ్డి తవ్వకాలు జరిపినట్లు గుర్తించి పట్టుకున్నామన్నారు. ఎంత మేర నాపరాయిని తవ్వారో అంచనా వేసి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీలో విజిలెన్స్ ఏడీ బైరాగి నాయుడు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

'ఉపాధి' వేతనాల చెల్లింపుల్లో మరింత పారదర్శకత

● ఆధార్ బేస్డ్ పేమెంట్ సిస్టమ్ అమలుకు రంగం సిద్ధం

కర్నూలు(అగ్రికల్చర్): ఉపాధి కూలీల వేతనాల చెల్లింపుల్లో పారదర్శకతను పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందుకోసం ఆధార్ బేస్డ్ పేమెంట్ సిస్టమ్(ఏబీపీఎస్) అమలు చేసేందుకు రంగం సిద్ధం చేసింది. గతంలో బ్యాంక్ అకౌంటు నంబర్లకు వేతనాలను జమ చేస్తున్నారు. ఇందులో అవకతవకలకు ఆస్కారం ఉండటంతో ఆధార్ నంబరు ఆధారంగా వేతనాలు ఇచ్చే ఏర్పాటు చేస్తున్నారు. జాబ్‌కార్డులకు ఆధార్ నంబరు లింక్ చేయడం, కూలీల ఆధార్ కార్డులను అప్‌డేట్ చేయడం, నేషనల్ పేమెంటు కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్‌పీసీఐ)తో మ్యాపింగ్ చేయడం చురుగ్గా జరుగుతోంది. జిల్లాలో 4,69,138 జాబ్‌కార్డులు ఉన్నాయి. ఇందులో 4,67,926 జాబ్‌కార్డులను జిల్లా నీటియాజమాన్య సంస్థ సిబ్బంది ఆధార్‌తో అనుసంధానం చేశారు. ఇంకా 1,212 జాబ్‌కార్డులను ఆధార్‌తో అనుసంధానం చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియను కూడా వారం రోజుల్లో పూర్తి చేయనున్నారు. కొత్త విధానంలో వేతనాల చెల్లింపు విజయవంతం కావాలంటే ఆధార్ అప్‌డేట్ అత్యవసరం.

ఏబీపీఎస్‌లోకి రాని కూలీలు 20,669 మంది

జాబ్‌కార్డుతో ఆధార్ అనుసంధానం, ఆధార్ అప్‌డేట్ ప్రకారం ఇంకా 20,669 మంది కూలీలు ఆధార్ బేస్డ్ పెమెంట్ సిస్టమ్‌లోకి రావాల్సి ఉంది. జాబ్ కార్డులను ఆధార్‌తో అనుసంధానం చేయడం, ఆధార్ అప్‌డేట్ అయినప్పటికీ ఎన్‌పీసీఐతో లింక్ కానందున ఏబీపీఎస్‌లోకి రాలేదు. ఆధార్‌తో లింక్ అయిన బ్యాంకు ఖాతాను బ్యాంకర్లు నేషనల్ పేమెంటు కార్పొరేషన్ ఆఫ్ ఇండియాతో లింక్ చేయాల్సి ఉంది. ప్రస్తుతం ఈ ప్రక్రియ చురుగ్గా జరుగుతోంది.

ప్రత్యేక దృష్టి సారించాం



ఉపాధి కూలీల వేతనాల చెల్లింపుల్లో పారదర్శకతను పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగానే ఆధార్ బేస్డ్ పేపెంటు సిస్టమ్ అమలుకు రంగం సిద్ధం చేసింది. ప్రస్తుతం ఉపాధి కూలీల జాబ్‌కార్డులను ఆధార్‌తో అనుసంధానం చేయడం, ఆధార్ అప్‌డేట్, ఆధార్ అథెంటికేషన్ ఫెయిల్యూర్స్‌ను పరిష్కరించడం, జాబ్‌కార్డు, ఆధార్ అనుసంధానం ఉన్న బ్యాంకు ఖాతాను ఎన్‌పీసీఐతో బ్యాంకుల ద్వారా లింకప్ చేయడం చురుగ్గా జరుగుతోంది. 20,669 మంది కూలీల వివరాలు ఆధార్ బేస్డ్ పేమెంటు సిస్టమ్ పరిధిలోకి రావాల్సి ఉంది. దీనిపై ప్రతేక దృష్టి సారించాం.

–అమరనాథరెడ్డి, ప్రాజెక్టు డైరెక్టర్, డ్వామా

భారీగా శాంపిల్ మందుల స్వాధీనం

● గణేష్ నగర్‌లో ఔషధ నియంత్రణ అధికారుల తనిఖీలు
● రూ.10 లక్షల విలువ చేసే శాంపిల్ మందులు ఉన్నట్లు అంచనా
● హైదరాబాద్ నుంచి కొనుగోలు
● ఆర్ఎంపీలకు, పలువురు రిటైలర్లకు అమ్మకం


శాంపిల్ మందులను పరిశీలిస్తున్న ఔషధ నియంత్రణ శాఖ అధికారులు


అధికారులు స్వాధీనం చేసుకున్న మందులు

కర్నూలు(హాస్పిటల్): రోగులకు ఉచితంగా డాక్టర్లు ఇచ్చే ఫిజీషియన్ శాంపిల్ మందులను దొంగచాటుగా కొనుగోలు చేసి వాటిని విక్రయించి సొమ్ము చేసుకుంటున్నాడో ప్రబుద్ధుడు. ఇతని సమాచారం తెలుసుకున్న ఔషధ నియంత్రణ శాఖ అధికారులు మూకుమ్మడిగా దాడి చేసి శాంపిల్ మందులను స్వాధీనం చేసుకున్నారు. కర్నూలు నగరంలోని గణేష్‌నగర్‌లో ఉంటున్న ఉదయ్‌కుమార్ అనే వ్యక్తి కొంతకాలంగా ఓ మెడికల్‌షాపు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో అతనికి హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి పరిచయమై ఫిజీషియన్ శాంపిల్ మందుల వ్యాపారాన్ని రుచిచూపించాడు. దీంతో కొన్ని సంవత్సరాలుగా అతను ఇలాంటి మందులను హైదరాబాద్, విజయవాడ, ముంబయి నుంచి కొనుగోలు చేస్తున్నాడు. ఇలా తెచ్చిన మందులను రాయలసీమ జిల్లాలతో పాటు తెలంగాణలోని పలు జిల్లాల ఆర్ఎంపీలకు సరఫరా చేస్తున్నాడు. తాజాగా అతను భారీగా శాంపిల్ మందులు కొని ఇంట్లో ఉంచుకున్నట్లు ఔషధ నియంత్రణ శాఖ అధికారులకు సమాచారం అందింది. దీంతో ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయశేఖర్, ఏడీ రమాదేవి, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు హరిహరతేజ, పర్వీన్‌బానులు గురువారం రాత్రి మూకుమ్మడిగా గణేష్‌నగర్‌లోని ఉదయ్‌కుమార్ ఇంటిపై దాడులు నిర్వహించారు. మొత్తం రూ.10లక్షల విలువ చేసే శాంపిల్ మందులు ఉన్నట్లు గుర్తించారు. వాటిలో యాంటిబయాటిక్స్, బీపీ, షుగర్ మాత్రలు, పెయిన్‌కిల్లర్లు, క్రీములు, ఆయింట్‌మెంట్‌లు తదితర 79 రకాల మందులు అధిక మొత్తంలో బయటపడ్డాయి. ఈ మేరకు మందులను సీజ్ చేసి ఉదయ్‌కుమార్‌పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. ఇతను 2017లో కూడా శాంపిల్ మందులు విక్రయిస్తూ అధికారులకు పట్టుబడ్డాడు. ఈ కేసు ఇప్పటికీ కొనసాగుతుండగా మరోసారి అధికారులకు పట్టుబడటం గమనార్హం.

ప్రమాదవశాత్తూ తుపాకీ పేలి హెడ్ కానిస్టేబుల్ మృతి


రేగడ్డ సత్యనారాయణ

కర్నూలు: లోకాయుక్త కోర్టులో గార్డు విధుల్లో ఉన్న ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ రేగడ్డ సత్యనారాయణ (52) ప్రమాదవశాత్తూ తుపాకీ (ఎస్ఎల్ఆర్) పేలి మృతిచెందాడు. ఈయన అశోక్‌నగర్‌లోని నాగార్జున అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్నాడు. శుక్రవారం ఉదయం విధులకు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి లోకాయుక్త కార్యాలయానికి వెళ్లాడు. గార్డు విధుల్లో ఉంటూ బాత్‌రూమ్‌కి వెళ్లి బయటకు వస్తుండగా చేతిలో ఉన్న తుపాకీ ప్రమాదవశాత్తూ పేలడంతో అక్కడే కుప్పకూలిపోయాడు. రక్తపు మడుగులో పడివున్న సత్యనారాయణను సహోద్యోగులు చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. 1992లో ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగం(ఏఆర్)లో కానిస్టేబుల్‌గా విధుల్లో చేరిన ఈయన ఎక్కువకాలం ఎంటీఓ సెక్షన్‌లో పనిచేశారు. ఇటీవలనే జనరల్ డ్యూటీలకు నియమించుకుని లోకాయుక్త కోర్టులో గార్డు డ్యూటీ విధులు నిర్వహిస్తూ ప్రమాదవశాత్తూ మృతిచెందాడు. ఈయనకు భార్య అనురాధతో పాటు పద్మనందిని, మౌనిక కూతుర్లు ఉన్నారు. విషయం తెలిసిన వెంటనే కర్నూలు డీఎస్పీ విజయశేఖర్, నాలుగో పట్టణ ఎస్ఐ పెద్దయ్య నాయుడు, ఆర్ఐలు రమణ, పోతురాజుతో పాటు పలువురు అధికారులు, సహోద్యోగులు ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి వచ్చి మృతదేహాన్ని సందర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రమాదవశాత్తూ తుపాకీ పేలి తన భర్త మృతిచెందినట్లు సత్యనారాయణ భార్య అనురాధ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాలుగో పట్టణ ఇన్‌చార్జి సీఐ శ్రీరాం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈయన తండ్రి నారాయణ కూడా ఏపీఎస్పీ కర్నూలు రెండో పటాలంలో ఆర్ఐగా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందారు.

పిట్టలదొరలా చంద్రబాబు హామీలు

● 2014లో నిరుద్యోగులకు పంగనామాలు
● రుణమాఫీ, డ్వాక్రా రుణాలంటూ మహిళలను నట్టేట ముంచారు
● జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.సుభాష్ చంద్రబోస్



చర్చావేదికలో మాట్లాడుతున్న సుభాష్ చంద్రబోస్

కర్నూలు(అర్బన్): తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్న ఆశతో పిట్టల దొరలా ఉత్తుత్తి హామీలు ప్రకటిస్తున్నారని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.సుభాష్ చంద్రబోస్ అన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక దేవనగర్‌లోని ఎంఎస్9 ఫంక్షన్ హాల్‌లో 'చంద్రబాబు హామీలు నమ్మశక్యమేనా' అంటూ చంద్రబాబు విశ్వసనీయతపై చర్చావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ మద్దయ్య, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి దేవపూజ ధనుంజయ ఆచారి, మహిళా విభాగం రీజనల్ కోఆర్డినేటర్ గాజుల శ్వేతారెడ్డి, బత్తుల లక్ష్మీకాంతయ్య, రిటైర్డ్ తహశీల్దార్ సి.బి.అజయ్‌కుమార్, సీనియర్ బీసీ సంఘం నాయకులు గడ్డం రామకృష్ణ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ.. 2014 ఎన్నికల్లో బాబు వస్తే జాబు వస్తుందని, ఇంటికో ఉద్యోగం ఇస్తామని ఊదరగొట్టి నిరుద్యోగులను మోసం చేశారని ఆరోపించారు. రైతులకు రుణమాఫీ చేస్తాం, బ్యాంకులలో బంగారంపై తీసుకున్న రుణాలను మాఫీ చేస్తాం, మహిళలకు డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక ఆయా వర్గాల వారందరినీ నట్టేట ముంచారని ఆరోపించారు. పేద ప్రజలకు మూడు సెంట్ల స్థలంలో పక్కా గృహాలు నిర్మించి ఇస్తామని మోసం చేశారన్నారు. పజల డబ్బుతో హైదరాబాదులో రూ.200 కోట్లు ఖర్చు పెట్టి చంద్రబాబు ప్యాలెస్ నిర్మించుకున్నారని దుమ్మెత్తి పోశారు. స్వర్ణాంధ్రప్రదేశ్ సాధిస్తానని ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన చంద్రబాబు తన పదవీ కాలమంతా దోచుకున్నాడని విమర్శించారు. మళ్లీ ఇప్పుడు తనను ముఖ్యమంత్రిని చేస్తే రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తా, అద్భుతాలు సృష్టిస్తానని ప్రజలను నమ్మించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. చంద్రబాబు హామీలను నమ్మే పరిస్థితుల్లో రాష్ట్ర ప్రజలు లేరరన్నారు. ఈ చర్చా వేదికలో చంద్రబాబును చిత్తుచిత్తుగా ఓడించి తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకునేందుకు ప్రజలు ఎదురుచూస్తున్నారని వక్తలు అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి డి.కె.రాజశేఖర్, వివిధ సంఘాల నాయకులు కృష్ణోజీ రావు, మద్దూరు శివ, బెస్త శ్రీనివాసులు, సత్యనారాయణ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

పంటలను కాపాడేలా..!


గోరుకల్లు రిజర్వాయర్

● నీరు ఇచ్చేందుకు కసరత్తు
● వచ్చేవారంలో మరోసారి ఐఏబీ సమావేశం

కర్నూలు సిటీ: వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఖరీఫ్‌లో సాగైన పంటలను కాపాడేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జలాశయాల్లో నీటిని జాగ్రత్తగా వాడుకునేందుకు కార్యాచరణ రూపొందించారు. దీనిని అమలు చేసేందుకు మరోసారి వచ్చే వారంలో సాగునీటి సలహా మండలి సమావేశాన్ని నంద్యాలలో నిర్వహించేందుకు సిద్ధం అవుతున్నట్లు ఇంజినీరింగ్ వర్గాలు తెలిపాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాకు తుంగభద్ర, కృష్ణా జలాలు ప్రధాన జల వనరులు. ఈ ఏడాది ఇప్పటి వరకు ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడంతో జలాశయాలకు నీటి లభ్యత అనుకున్నంతగా రాలేదు. జలవనరుల శాఖ ముందస్తుగా తీసుకున్న నిర్ణయాలతో కొంత మేరకైనా రిజర్వాయర్లలో నీటిని నిల్వ చేయడంతో ఖరీఫ్‌లో సాగు చేసిన ఆయకట్టుకు వారాబందీ ప్రకారమైన నీటిని ఇచ్చేందుకు అవకాశం కలిగింది. ఉమ్మడి జిల్లాలో తెలుగుగంగ, శ్రీశైలం కుడి కాలువ, ఆవుకు రిజర్వాయర్ల పరిధిలోని సాగు చేసిన ఆయకట్టుకు తక్కువ నీటి లభ్యత ఉన్నా..సాగు చేసిన పంటలను కాపాడేందుకు ప్రత్యేక ప్రణాళికను రూపొందించారు. ఉన్నతాధికారులు చేసిన సూచనల మేరకు దీనిని అమలు చేయనున్నారు. తుంగభద్ర నదిలో నీటి ప్రవాహాన్ని బట్టి నది తీర ప్రాంతాల్లోని లిఫ్ట్ స్కీమ్‌లు, పులికనుమ రిజర్వాయర్, గురురాఘవేంద్ర ప్రాజెక్టు పరిధిలోని ఎత్తిపోతల పథకాలకు, పులకుర్తి ఎత్తిపోతల పథకానికి సైతం నీటి వినియోగించుకునేందుకు అవకాశం ఉంది.

వారాబందీ ప్రకారం నీరు!

తుంగభద్ర దిగువ కాలువ కింద ఖరీఫ్, రబీ సీజన్‌లో 1.51 లక్షలు, ఆలూరు బ్రాంచ్ కెనాల్ కింద 14 వేలు, కర్నూలు–కడప కాల్వ కింద ఖరీఫ్, రబీలో 2.65 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ ఏడాది నీటి లభ్యత తక్కువగా ఉండడంతో తుంగభద్ర దిగువకాలువ పరిధిలోని ఖరీఫ్‌లో 40 వేల ఎకరాలకు, ఆలూరు బ్రాంచ్ కెనాల్ పరిధిలో 6 వేల ఎకరాలకు నీరు ఇవ్వనున్నారు. ప్రస్తుతం వెలుగోడు రిజర్వాయర్‌లో 7.105 టీఎంసీలు, గోరుకల్లు రిజర్వాయర్‌లో 8.80 టీఎంసీల నీరు నిల్వ ఉంది. తెలుగుగంగ, ఎస్ఆర్‌బీసీ కాలువల పరిధిలో సుమారుగా 1.65 లక్షల ఎకరాలు ఖరీఫ్‌లో సాగు చేసినట్లు ఇంజినీర్లు అంచనాలు వేస్తున్నారు. ఈ ఆయకట్టుకు వారాబందీ ప్రకారం అయినా నీరిచ్చి పంటలను కాపాడేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

ఆయకట్టుకు ఇబ్బందులు లేవు

ఈ ఏడాది కృష్ణా బేసిన్‌లో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవ లేదు. గత నెలలో వచ్చిన కొంత నీటిని రిజర్వాయర్లలో నిల్వ చేశాం. తెలుగుగంగ, ఎస్ఆర్‌బీసీ కాలువల పరిధిలో ఖరీఫ్‌లో సాగు చేసిన ఆయకట్టును కాపాడేందుకు ఆన్అండ్ఆఫ్ పద్ధతిలో నీరు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఖరీఫ్‌లో ఎల్లెల్సీ ఆయకట్టుకు ఎలాంటి ఇబ్బందులు లేవు. కేసీ కెనాల్‌కు ప్రస్తుతం తుంగభద్ర నదిలో ప్రవాహం వస్తుండడంతోనే నీరు ఇస్తున్నాం. ఎగువ నుంచి ప్రవాహం లేకపోతే నీరు ఇవ్వడం సాధ్యం కాదు. తక్కువ నీటితో పండే పంటలను మాత్రమే సాగు చేసుకోవాలని ఆయకట్టు రైతులకు సైతం తెలియజేశాం.

– కబీర్ బాషా, సీఈ జల వనరుల శాఖ

సాక్షి ఫ్యామిలీ
కర్నూలు
శనివారం ॥ 9-9-2023



రైమతి ఘురియా

సుబాసా మోహన్తా

చిరుధాన్యలక్ష్మికళ

కలెక్టర్ పిల్లలు కలెక్టర్, హీరో పిల్లలు హీరో, రాజకీయ నాయకుడు పిల్లలు రాజకీయ నాయకులు కావాలని కోరుకుంటే, ఇక మధ్యతరగతి తల్లిదండ్రులు... తమలా తమ పిల్లలు ఇబ్బందులు పడకూడదని, తిని, తినక ఒక్కోరూపాయి పోగుచేసి, కష్టపడి చదివించి పిల్లలను విదేశాలకు పంపిస్తున్నారు. పంటలు పండించి అందరి ఆకలి తీర్చే రైతన్నలు మాత్రం తమ పిల్లలు తమలా రైతులు కావాలని అస్సలు కోరుకోవడం లేదు. ''పెద్దయ్యాక రైతును అవుతాను'' అని కూడా ఎవరూ చెప్పరు. ''మేము వ్యవసాయం చేస్తాం, ఎంతోమందికి ఆదర్శంగా నిలిచాం. ఇప్పుడు ప్రపంచ దేశాధ్యక్షులు సైతం మేము చెప్పబోయేది ఆసక్తిగా వినబోతున్నారు అదీ వ్యవసాయం గొప్పతనం'' అని చాటిచెబుతున్నారు ఇద్దరు మహిళా రైతులు.

అవును గొప్పగొప్ప చదువులు చదివినవారి కంటే..తమ పూర్వీకుల నాటి నుంచి ఆచరిస్తోన్న పద్ధతులతో వ్యవసాయం చేస్తూ అందరి దృష్టి తమవైపు తిప్పుకున్న రైతులకు జీ-20 సదస్సుకు ఆహ్వానాలు అందాయి. పెద్దపెద్ద డిగ్రీలు, హోదాలు లేకపోయినప్పటికీ.. కేవలం వ్యవసాయం చేస్తున్నారన్న ఒక్క కారణంతో ... ప్రపంచ దేశాధ్యక్షులు పాల్గొనే 'జీ-20 సమితి'లో పాల్గొనే అవకాశం ఇద్దరు మహిళా రైతులకు దక్కింది. ఒడిశాకు చెందిన గిరిజన మహిళా రైతులు 'రైమతి ఘురియా, సుబాసా మోహన్తా' లకు ఈ అరుదైన గౌరవం లభించింది. సంప్రదాయ, గిరిజన చిరుధాన్యాల (మిల్లెట్స్) సాగు పద్ధతులను జీ-20 వేదికపై ఈ ఇద్దరు ప్రపంచ దేశాలకు వివరించనున్నారు.

కోరాపుట్ జిల్లాలోని నౌగుడా గ్రామానికి చెందిన రైతే 36 ఏళ్ల రైమతి ఘురియా. భూమియా జాతికి చెందిన రైమతికి ముగ్గురు పిల్లలు. మొదటి నుంచి వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తోంది. ఏళ్లపాటు వరిధాన్యాలు పండించే రైమతి... చిరుధాన్యాల సాగు మెళుకువలు నేర్చుకుని మిల్లెట్స్ సాగు మొదలు పెట్టింది. అధునాతన సాంకేతికతను జోడించి పంటలో అధిక దిగుబడిని సాధిస్తోంది. సాగులోలేని 72 దేశీయ వరి రకాలు, ఆరు చిరుధాన్యాలతో కలిపి మొత్తం 124 రకాల ధాన్యాలను అంతరించిపోకుండా కాపాడుతోంది. మంచి దిగుబడితో సాధిస్తున్న రైతుగానే గాక, తోటి గిరిజన రైతులకు చిరుధాన్యాల సాగులో సాయం చేస్తూ వారికీ జీవనోపాధి కల్పిస్తోంది. సంప్రదాయ పంటలైన వరి, మిల్లెట్ రకాలను పండిస్తూనే తన గిరిజన మహిళలెందరికో ఆదర్శంగా నిలుస్తూ... మిల్లెట్ సాగును ప్రోత్సహిస్తోంది. పంటమార్పిడి, అంతర పంటలు, సేంద్రియ పంటల్లో తెగులు నివారణ మెళకువల గురించి, స్కూలును ఏర్పాటు చేసి ఏకంగా 2500 మంది రైతులకు శిక్షణ ఇచ్చింది. చిరుధాన్యాల సాగులో రైమతి చేసిన కృషికిగా గుర్తింపుగా అనేక ప్రశంసలు కూడా అందుకుంది. 2012లో జీనోమ్ సేవియర్ కమ్యునిటీ అవార్డు, 2015లో జమ్షెడ్జీ టాటా నేషనల్ వర్చువల్ అకాడమీ ఫెలోషిప్ అవార్డు, టాటా స్టీల్ నుంచి 'బెస్ట్ ఫార్మర్' అవార్డులే గాక, ఇతర అవార్డులు అందుకుంది.

> జీ20 సదస్సుకు హాజరవుతున్నందుకు చాలా సంతోషంగా ఉంది. చిరుధాన్యాల సాగు, ఈ ధాన్యాల ప్రాముఖ్యత గురించి అందరికీ చెబుతాను. గిరిజన మహిళగా గిరిజన సాగు పద్ధతులను మరింత విపులంగా అందరికీ పరిచయం చేస్తాను.
> **- రైమతి ఘురియా**

చిరుధాన్యాల సాగులో అనుసరిస్తోన్న పద్ధతులు, దిగుబడి, తోటి రైతులను ఆదుకునే విధానమే రైమతిని జీ20 సదస్సుకు వెళ్లేలా చేసింది. ఈ సదస్సులో ఇండియన్ అగ్రికల్చరల్ రిసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటు చేసే ఎగ్జిబిషన్‌లో వివిధ రకాల చిరుధాన్యాలు, ఈ ధాన్యాలతో చేసిన విభిన్న వంటకాలు, చిరుధాన్యాలతో వేసిన ముగ్గులను ప్రదర్శించనుంది. చిరుధాన్యాల సాగులో తాను ఎదుర్కొన్న పరిస్థితులు, అధిక దిగుబడి కోసం అవలంబిస్తోన్న విధానాలు వివరించనుంది. మిల్లెట్ సాగులో అనుసరించాల్సిన అధునాతన సాంకేతికత, దాని ఉపయోగాల గురించి ఎమ్ఎస్ స్వామినాథన్ రిసెర్చ్ సెంటర్ ఇచ్చిన శిక్షణ సంబంధిత అంశాలను ప్రస్తావించనుంది.

సుబాసా మొహన్తా

మయూర్‌భంజ్ జిల్లాలోని గోలి గ్రామానికి చెందిన చిరుధాన్యాల రైతే 45 ఏళ్ల సుబాసా మొహన్తా. తన జిల్లాలో ఎవరికీ చిరుధాన్యాల సాగుపై ఆసక్తి ఏమాత్రం లేదు. 2018లో ఒడిశా ప్రభుత్వం రైతులను చిరుధాన్యాల సాగు చేయమని మిల్లెట్ మిషన్‌ను తీసుకొచ్చింది. కానీ ఎవరూ ముందుకు రాలేదు. అలాంటి పరిస్థితుల్లో ధైర్యం చేసి ముందుకొచ్చింది సుబాసా. ఏళ్లనాటి గిరిజన సాగుపద్ధతులను ఉపయోగిస్తూ రాగుల సాగును ప్రారంభించింది. అప్పటి నుంచి మిల్లెట్స్‌ను పండిస్తూ అధిక దిగుబడిని సాధిస్తోంది. ఇది చూసిన ఇతర రైతులు సైతం సుబాసాను సాయమడగడంతో వారికి సాగు పద్ధతులు, మెళకువలు నేర్పిస్తూ మిల్లెట్ సాగును విస్తరిస్తోంది. సుబాసాను ఎంతో మంది గిరిజన మహిళలు ఆదర్శంగా తీసుకుని చిరుధాన్యాలు సాగుచేయడం విశేషం. సుబాసా కృషిని గుర్తించిన రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అవార్డులతో సత్కరించాయి.

> చిరుధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో మంచిచేస్తాయి. ఇవి అనేక రకాల వ్యాధులు రాకుండా కాపాడతాయి. ఒకప్పుడు గిరిజనుల ప్రధాన ఆహారం చిరుధాన్యాలు. కానీ ఇప్పుడు పొలాల నుంచి దాదాపు కనుమరుగయ్యాయి. నేను ధాన్యాలు పండించడం మొదలు పెట్టిన తరువాత నన్ను చూసి చాలామంది రైతులు చిరుధాన్యాలు సాగుచేయడం ప్రారంభించారు. ఇతర రైతులకు వచ్చే సందేహాలు నివృత్తి చేస్తూ, సలహాలు ఇస్తూ ప్రోత్సహించాను. వరికంటే చిరుధాన్యాల సాగులో అధిక దిగుబడులు వస్తుండడంతో అంతా ఈ సాగుకే ప్రాధాన్యం ఇస్తున్నారు.
> **- సుబాసా మోహన్తా**



గ్రామీణ మహిళలతో షెఫాలికా

మహిళా సాధికారతకు మార్గదర్శనం

పెద్ద ఎంటర్‌ప్రెన్యూర్ కావాలని కలలు కన్న షెఫాలికా పండా ఆ కలకు దూరమై పేదలకు దగ్గరైంది. మహాపట్టణం నుంచి మారుమూల పల్లె వరకు ఎన్నో ప్రాంతాలు తిరిగింది. తమ ఫౌండేషన్ తరఫున ఎంతోమందికి అండగా నిలబడింది. కష్టాలు, సమస్యల్లో ఉన్నవారికి సహాయం చేయడమే కాకుండా స్త్రీ సాధికారతకు సంబంధించి ఎన్నో కార్యక్రమాలు నిర్వహించింది. 'జీ20 ఎంపవర్ వర్కింగ్ గ్రూప్ ఆన్ మెంటార్‌షిప్' కన్వీనర్‌గా స్త్రీ సాధికారతకు సంబంధించి విస్తృత స్థాయిలో పనిచేసే అవకాశం షెఫాలికా పండాకు లభించింది...

కాలేజీ రోజుల్లో 'సక్సెస్‌ఫుల్ ఎంటర్‌ప్రెన్యూర్' కావాలని కలలు కనేది షెఫాలికా. అయితే ఒకానొక సంఘటనతో ఆమె కలల దారి మారింది. తమ బంధువు ఒకరు అనారోగ్యం పాలుకావడంతో, ఒడిషాలో సరియైన వైద్య సదుపాయాలు లేకపోవడంతో ఢిల్లీకి తీసుకుపోవాల్సి వచ్చింది. ఆ సమయంలో ఆర్థిక ఇబ్బందుల నుంచి అసౌకర్యాల వరకు ఎన్నో సంఘటనలను దగ్గరగా చూసింది షెఫాలికా పండా.

'చదువుకున్న వారు, ఆర్థికంగా కాస్త మెరుగైన స్థితిలో ఉన్నవారి పరిస్థితే ఇలా ఉంటే ఒడిశాలోని మారుమూల ప్రాంతాలలో ఉండే పేద ప్రజల పరిస్థితి ఏమిటి?' అని ఆలోచించింది. ఆ ఆలోచనల ఫలితంగా సేవారంగంలోకి వచ్చిన షెఫాలికా ఎంతోమంది పేదలకు అండగా నిలబడింది.

బన్సిధర్ అండ్ 'ఇలా పండా' ఫౌండేషన్ ద్వారా సామాజిక సేవాకార్యక్రమాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లింది.

'నాయకుల ఎదుగుదలకు సంబంధించి అనుభవం అనేది కీలకమైన పాత్ర పోషిస్తుంది. ఎంత అనుభవం ఉంటే అంత బలం సమకూరుతుంది. సామాజిక సేవా రంగంలో పదహారు సంవత్సరాలుగా పనిచేస్తున్నాను. సమాజంలో సానుకూల మార్పు తేవాలనుకునేవారికి సమస్యను అర్థం చేసుకోవడంతో పాటు దానిపై పని చేయడానికి చాలా ఓపిక కావాలి. సామాజిక సేవలో మా అత్తమ్మ 'ఇలా పండా' నాకు ఆదర్శం. ఎలాంటి ఆడంబరం లేకుండానే ఎన్నో సంవత్సరాలు సేవ చేసింది. ఎండనకా, వాననకా తిరిగినా ఆమె ముఖంలో ఎప్పుడూ అలసట కనిపించేది కాదు. సామాజిక సేవ తన ఆరోగ్య రహస్యంగా చెప్పుకునేది. ఆమె చురుకుదనం, సామాజిక సేవాదృక్పథాన్ని చూసి ఎంతో మంది స్ఫూర్తి పొందారు. అందులో నేను ఒకరిని' అంటుంది షెఫాలికా.

'అవసరం ఉన్న చోట మేముంటాం' అనే నినాదంతో బన్సిధర్ అండ్ 'ఇలా పండా' ఫౌండేషన్ ట్రస్టీ, సీయివోగా ఎన్నో వినూత్నమైన కార్యక్రమాలు చేపట్టింది.

'మహిళలపై ప్రధానంగా దృష్టి పెట్టడానికి కారణం అసమానత, లింగ వివక్షత. మహిళల జీవితాలు మారాలంటే ఆమె పిల్లల జీవితాల్లో కూడా మార్పు రావాలని బలంగా నమ్ముతాను' అంటుంది షెఫాలికా.



> అవకాశాలు దొరికేవారు, దొరకని వారు అని మహిళలకు సంబంధించి రెండు రకాల వర్గీకరణలున్నాయి. అవకాశాలు దొరికేవారు సులభంగానే విజయం సాధించి పెద్ద స్థాయికి చేరుకుంటారు. మరి దొరకని వారి పరిస్థితి ఏమిటి? సాంకేతిక, జీవన నైపుణ్యాలు, చదువు రూపంలో అలాంటి వారిని వెలుగులోకి తీసుకువచ్చి విజయపథంలోకి తీసుకువెళ్లడంపై, మహిళలకు సమాన అవకాశాలు ఎలా కల్పించాలనే దానిపై జీ20 సదస్సు దృష్టి పెడుతుంది. జీ20 ఉమెన్స్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ ద్వారా వ్యాపారవేత్తలు కావాలనుకునేవారికి, ఔత్సాహిక వ్యాపారవేత్తలకు ఎంతో మేలు జరుగుతుంది. 30,000 మంది ఎంటర్‌ప్రెన్యూర్‌ల అనుభవాలు పాఠాలుగా ఉపయోగపడతాయి.
> **- షెఫాలికా,**
> కన్వీనర్, జీ20 ఎంపవర్ వర్కింగ్ గ్రూప్ ఆన్ మెంటర్‌షిప్

చెత్త ఏరుతూ ఎత్తుకు ఎదుగుతూ

*** స్ఫూర్తి**

మూసారాంబాగ్ సమీపంలోని సలీం నగర్‌లో తెల్లవారుజామున 'చెత్తబండొచ్చిందమ్మా' అని అరుస్తూ కనిపిస్తుంది జయలక్ష్మి. డిగ్రీ చదువుతూ తల్లి నడిపే చెత్తబండిలో సాయం చేస్తుంది జయలక్ష్మి. 'ఎదగాలనుకుంటే చెత్త నుంచి కూడా ఎదగొచ్చు' అంటుందా అమ్మాయి. తాను నివాసం ఉండే మురికివాడ పిల్లల కోసం ట్యూషన్లు చెబుతూ, వాలంటీర్‌గా పని చేస్తూ, ప్రతిష్ఠాత్మక 'గాంధీ - కింగ్ స్కాలర్లీ ఎక్స్ఛేంజ్ ఇనిషియేటివ్'లో భాగంగా జూన్‌లో అమెరికా వెళ్లి వచ్చింది జయలక్ష్మి. చిన్న చితకా సవాళ్లకే డీలా పడుతున్న యూత్‌కు జయలక్ష్మి ఇచ్చే స్ఫూర్తి చాలానే ఉంది.

యునైటెడ్ స్టేట్స్- ఇండియా ఎడ్యుకేషన్ ఫౌండేషన్ (యు.ఎస్.ఐ.ఇ.ఎఫ్) వారి 'గాంధీ- కింగ్ ఎక్స్ఛేంజ్ ఇనిషియేటివ్' స్కాలర్‌షిప్ పొంది, అమెరికా వెళ్లి రెండు వారాల పాటు మార్టిన్ లూథర్ కింగ్ మార్గంలో అహింసా పద్ధతితో ప్రజా ఉద్యమాలు ఎలా నిర్వహించాలో అధ్యయం చేసి రావడానికి దరఖాస్తులు కోరినప్పుడు మన దేశ వ్యాప్తంగా 4 వేల అప్లికేషన్లు వచ్చాయి. వారిలో కేవలం 10 మందిని మాత్రమే ఎంపిక చేస్తారు. ఆ పది మందిలో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ముగ్గురు ఉన్నారు. వారిలో ఒకరు అరిపిన జయలక్ష్మి.

హైదరాబాద్‌లోని కర్మన్‌ఘాట్ సమీపంలో అతి పెద్ద మురికివాడ- సింగరేణి కాలనీలో ఉంటూ, చెత్త బండి లాగుతూ చదువుకుంటున్న ఈ అమ్మాయి ఇలా అమెరికా వరకూ చేరుకోవడం సామాన్యం కాదు. పోరాడే తత్వం, సాధించాలనే పట్టుదల ఉండటం వల్లే ఇది సాధ్యమైంది. జయలక్ష్మిలోని అసాధారణమైన చొరవ, తపన ఆమెను ఇలా ముందుకు నడుపుతున్నాయి.



అమెరికాలో జయలక్ష్మి

ముగ్గుపిండి అమ్మే దళిత కుటుంబం

అరిపిన జయలక్ష్మిది రాయలసీమ ప్రాంతానికి చెందిన దళిత కుటుంబం. తండ్రి రామ్మోహన్, తల్లి హుసేనమ్మ చిన్న వయసులోనే పెళ్లి చేసుకుని హైదరాబాద్ వలస వచ్చారు. వీరి ఇళ్లల్లో ముగ్గుపిండి అమ్ముకుని తరాలుగా జీవనం సాగిస్తున్నారు. అయితే జయలక్ష్మి తల్లిదండ్రులు చెత్తబండి నడపడాన్ని ఉపాధి చేసుకున్నారు. 'అమ్మ ఒక బండి, నాన్న ఒక బండి నడుపుతారు. కాలనీ వాళ్ల నెలకు ఇంతని ఇచ్చే డబ్బులే మాకు జీవనాధారం. గవర్నమెంట్ నుంచి ఏమీ జీతం రాదు. చెత్త తీయడం చాలా కష్టమైన పని. నాన్న తానొక్కడే చెత్త తీయగలిగినా అమ్మకు కష్టమని నేను ఏడో క్లాస్ నుంచి ఇవాల్టి వరకూ ఆమెకు తోడు వెళుతూనే ఉన్నాను. చెత్త సేకరించడం, తడిచెత్త పొడిచెత్త వేరు చేయడం, డంపింగ్ యార్డ్‌లో పడేయడం అన్నీ చేస్తాను. ఇది చాలా దారుణమైన పని అని కొందరు అంటారు. కాని నా మటుకు నాకు ఇది అన్నం పెట్టే వృత్తి. నేను దానిని గౌరవిస్తాను. మా ఇంట్లో నేను కాకుండా అన్నయ్య, చెల్లెలు ఉన్నారు. అందరూ మంచిగా చదువుకుని ఉద్యోగాల్లో స్థిరపడాలని మా అమ్మ తపన. అంతవరకు ఈ పని చేయకతప్పదు' అంటుంది జయలక్ష్మి.



బండిలో చెత్త వేస్తున్న జయలక్ష్మి

ఎన్.జి.ఓ దృష్టిలో పడి

జయలక్ష్మి చిన్నప్పటి నుంచి చురుగ్గా ఉండేది. కాలనీలోని సమస్యలపై మాట్లాడేది. స్కూల్లో ఒకసారి ఇలాగే మాట్లాడితే 'మాంట్‌ఫోర్ట్ సోషల్ ఇన్‌స్టిట్యూట్' అనే ఎన్.జి.ఓ దృష్టిలో పడింది. పేదవర్గాల కోసం పని చేసే ఆ నంస్థ జయలక్ష్మిని తన కార్యకలాపాల్లో భాగం చేస్తూ ప్రోత్సహించింది.

'స్లమ్స్‌లో ఉండే పిల్లల వికాసం కోసం నేను పని చేశాను. హైదరాబాద్‌లో 56 స్లమ్స్ ఉంటే వాటిలో 21 చోట్ల అంగన్‌వాడీ కేంద్రాలు లేవు. మేమందరం మహిళా సంక్షేమ శాఖ దగ్గరకు వెళ్లి మాట్లాడి వాటిని సాధించాం' అంటుంది జయలక్ష్మి. ఇంగ్లిష్ మీడియంలో చదవాలనుకుని తన వాడ నుంచి నాలుగు కిలోమీటర్లు నడిచి వెళ్లి చదువుకున్న జయలక్ష్మి తన వాడలోని పిల్లలకు సాయంత్రాలు ట్యూషన్ చెప్తూ వారి చదువుకు మేలు చేస్తోంది. 'కోవిడ్ సమయంలో మా కాలనీలో నేను కార్యకర్తగా పని చేశాను. కోవిడ్ రాకుండా చాలా వరకు సక్సెస్ అయ్యాను' అంది.

ఐ.ఎ.ఎస్ కావాలని

'యువతకు నాయకత్వ లక్షణాలు ఉండాలి. హక్కుల కోసం పోరాడాలి. అమెరికాలో శాంతియుత పోరాటాల విజయగాథలను అధ్యయనం చేయగలగడం నా అదృష్టం. ఒక యువ ప్రతినిధిగా పోరాడుతూనే ప్రజల సేవ కోసం ఐ.ఎ.ఎస్ సాధించాలనుకుంటున్నాను. అందుకు కావలసిన సహాయం పొందగలననే అనుకుంటున్నాను. నాకు ఎంతమంచి పేరున్నా చెత్త అమ్మాయి అనే పిలుస్తారు కొందరు. వారి చేత ఉత్తమ అమ్మాయి అనిపించుకునేందుకు, లక్ష్యం లేని వారి బుర్రలే చెత్త అని నిరూపించేందుకు మరింత కష్టపడతాను' అంది జయలక్ష్మి.

– సాక్షి ఫీచర్స్ డెస్క్

*** సందర్భం**



జి.వి. ప్రసాద్

పక్షులతో ప్రయాణం

ఛాయాచిత్ర ప్రేమికుడు జి.వి. ప్రసాద్‌తో 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూ

ఒక ఫొటో వెయ్యి పదాలకు సమానం. పక్షులు, వన్యప్రాణుల ఫొటోలు తీయాలంటే, గంటల కొద్దీ వేచి చూడాలి. వాటి ప్రశాంతతకు భంగం కలగకుండా ఫొటోలు తీయడం కత్తిమీద సాములాంటిదే. పారిశ్రామికవేత్త, డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్ లిమిటెడ్ కో చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ జి.వి. ప్రసాద్‌కి మాత్రం అది ఆట విడుపు. ఆయన దేశ విదేశాల్లో పర్యటించి తీసిన ఫొటోలతో ఇటీవల 'ది బర్డ్స్ అండ్ బిలీఫ్స్' పుస్తకాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా... సాక్షితో సంభాషణ.



■ **ఔషధాల తయారీ రంగంలో తీరిక లేకుండా ఉండే మీకు, పక్షుల కోసం పర్యటనలు, ఫొటోగ్రఫీ హాబీ ఎప్పటి నుంచి?**

గత పది, పదిహేనేళ్లుగా ఫొటోగ్రఫీ చేస్తున్నాను. ప్రపంచవ్యాప్తంగా పర్యటించి, స్వయంగా తీసిన ఫొటోల సమాహారమే ఈ పుస్తకం. కొన్ని ఫొటోలతో పుస్తకాన్ని తీసుకురావాలని, మరికొన్నింటితో ప్రదర్శన ఏర్పాటు చేయాలని నా ఆలోచన. గతంలో రెండు పుస్తకాలు ప్రచురించాను. ఒకటి అలాస్కా మీద, మరొకటి స్పితి వ్యాలీ. ఇది మూడో పుస్తకం.

■ **'బర్డ్స్ అండ్ బిలీఫ్స్' లో మంచి కొటేషన్‌లు కూడా కనిపిస్తున్నాయి!**

నన్ను ప్రభావితం చేసే సూక్తులు కనిపించినప్పుడు, విన్నప్పుడు పుస్తకంలో రాసుకోవడం నాకు పాతికేళ్లుగా అలవాటు. వాటిలో కొన్నింటిని ఇందులో పొందుపరిచాను. ఈ పుస్తకం నా అభిరుచికి, జ్ఞాపకాలకు నిలువుటద్దం.

■ **ఇందులో ఏఏ ప్రదేశాల పక్షులున్నాయి?**

మనదేశంలో దక్షిణాదిలో హైదరాబాద్, ఉత్తరాది నుంచి భరత్‌పూర్, కాన్హా నేషనల్ పార్క్. ఆఫ్రికా ఖండంలో కెన్యా, టాంజానియా, బొట్స్వానా, నార్త్ ఆర్కిటిక్, అంటార్కిటికా తదితర ప్రాంతాల పక్షుల ఫొటోలున్నాయి. అంటార్కిటికాలో పెంగ్విన్స్ కూడా తీశాను. నార్త్ అమెరికాలో అలాస్కా కూడా కవర్ చేశాను. ఈ ప్రాంతాలలో కనిపించే పక్షులతో పాటు క్షీరదాలు, ప్రకృతి ఫొటోలూ తీశాను. కానీ, ఈ పుస్తకాన్ని మాత్రం పక్షుల కోసమే కేటాయించాను.

■ **వలస పక్షులు భారీగా వచ్చే ఆంధ్రప్రదేశ్, పులికాట్ సరస్సుకు వెళ్లారా?**

వెళ్లాను, ఫ్లెమింగో ఫొటోలు తీశాను. కానీ ఈ పుస్తకంలో ప్రచురించలేదు.



■ **బర్డ్ వాచింగ్ కోసం విభిన్నమైన అనేక ప్రాంతాలను సందర్శించారు. మీకు బాగా నచ్చిన ప్రదేశం, సందర్భం, ఫొటో ఏది?**

అలాస్కాలో ల్యాండ్ స్కేప్‌లు, మంచినీటి సరస్సులు, ఉప్పు నీటి చెరువులు, పొరలు పొరలుగా పేరుకుపోయిన మంచు... మొత్తంగా చూస్తే ప్రకృతి అద్భుతంగా స్ఫూర్తిదాయంగా అనిపిస్తుంటుంది. పెద్ద ఎలుగుబంట్లు, బాల్డ్ ఈగల్స్, సాల్మన్ చేపలతోపాటు రకరకాల చేపలుంటాయి. సముద్రం నుంచి మంచి నీటి సరస్సుల వైపుకు గుంపులుగా వచ్చే చేపల్ని చూడడం వర్ణించలేనటువంటి అనుభూతి. అలాగే మరొకటి... ఆఫ్రికాలో ప్రాణులు వలస వెళ్లడం. వైల్డ్ బీస్ట్ పెద్ద సంఖ్యలో నదిని దాటుతున్న దృశ్యం ఇప్పటికీ కళ్లముందు కదలాడుతోంది.

■ **ఆర్నిథాలజిస్టు ఆశిష్, కెమెరా మెళకువలు నేర్పిన సురేశ్ చిత్తూరి గురించి మీ పుస్తకంలో ప్రత్యేకంగా ప్రస్తావించారు!**

ఆశిష్‌తో చాలా ఏళ్ల పరిచయం. వాళ్ల పిల్లలు, మా పిల్లలు క్లాస్‌మేట్స్. బర్డ్ వాచింగ్‌ను పరిచయం చేసింది ఆయనే. ఇక శ్రీనివాస హ్యాచరీస్ సురేశ్ చిత్తూరి కూడా నాకు మంచి మార్గదర్శి.

■ **ఎన్నిరకాల పక్షులను ఫొటో తీశారు?**

రెండువందలకు పైగా పక్షి జాతులను ఫొటో తీశాను.

■ **మీ పుస్తకంలో పాలపిట్ట, కాకి, కోకిల కనిపించాయి. కానీ రామచిలుక కనిపించలేదు! అలాగే కొల్లేటి కొంగలు, చిల్కా సరస్సులో విహరించే పక్షులను మేము తర్వాతి పుస్తకంలో చూడవచ్చా?**

రామచిలుకల ఫొటో తీశాను. కానీ, పుస్తకానికి ఫొటోల ఎంపికలో వదిలిపెట్టాను. కొల్లేరు వెళ్లలేదు. చిల్కా సరస్సుకు వచ్చే ఏడాది వెళదామనుకుంటున్నాను.

శాస్త్రీయతకు గౌరవం

డాక్టర్ రెడ్డీస్ సంస్థలో 1990 నుంచి బాధ్యతలు నిర్వర్తిస్తున్న జీవీ ప్రసాద్ ఆ సంస్థ ఎదుగుదల, 66 దేశాలకు విస్తరణలో తనవంతుగా విశేషమైన కృషి చేశారు. సశాస్త్రీయమైన పరిశోధనల పరంపరలో ఆయనను వరించిన కొన్ని ప్రత్యేక గుర్తింపులు... పురస్కారాలివి.

- వైపీఓ గ్లోబల్ ఇంపాక్ట్ అవార్డు- 2020
- వి. కృష్ణమూర్తి అవార్డ్ ఫర్ ఎక్స్‌లెన్స్ బై ద సెంటర్ ఫర్ ఆర్గనైజేషనల్ డెవలప్‌మెంట్, 2019
- బౌండరీ బ్రేకర్ లీడర్ అవార్డ్, సీఈఓ అవార్డ్స్ 2018
- ఇండియా బిజినెస్ లీడర్ ఆఫ్ ద ఇయర్ బై సీఎన్‌బీసీ ఆసియా, 2015
- ఇండియాస్ బెస్ట్ సీఈవో బై బిజినెస్ టుడే, 2014
- ఇండియా టాలెంట్ మేనేజ్‌మెంట్ అవార్డ్ బై సీఎన్‌బీసీ ఆసియా, 2014

■ **మీ నేపథ్యం మొత్తం హైదరాబాదేనా?**

లేదు, పాక్షిక హైదరాబాదీని. నాల్గవ తరగతి వరకు హైదరాబాద్‌లో చదివాను. తర్వాత నెల్లూరులో 12వ తరగతి వరకు, రెండున్నరేళ్లు చెన్నై అన్నా యూనివర్సిటీ, ఆ తర్వాత చికాగోలో ఇలినాయీ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీలో కెమికల్ ఇంజినీరింగ్, మాస్టర్స్ పర్డ్యూ (Purdue University) యూనివర్సిటీలో పూర్తి చేసి హైదరాబాద్‌కి వచ్చాను.

■ **పుస్తకం విక్రయం ద్వారా వచ్చిన మొత్తాన్ని వన్యప్రాణుల సంరక్షణ కోసం విరాళమని ప్రకటించారు. వన్యప్రాణుల సంరక్షణలో ప్రభుత్వం తగినంత శ్రద్ధ చూపట్లేదని అనుకుంటున్నారా?**

ప్రభుత్వం వన్యప్రాణుల సంరక్షణకు పెద్ద మొత్తంలో నిధులు విడుదల చేస్తోంది. కానీ, ప్రభుత్వం ఒక్కటే అన్నింటినీ పరిష్కరించలేదు. వ్యక్తుల విరాళాలు చాలా ఉపయోగ పడతాయి. పర్యావరణం, వన్యప్రాణుల పరిరక్షణ ముఖ్యమైన అంశం అని నేను మద్దతు ఇస్తున్నాను. ఆన్‌లైన్‌లో అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ ద్వారా విక్రయిస్తున్నాం. పుస్తక విక్రయాలతో వచ్చే డబ్బు నాకవసరం లేదు. ఉచితంగా ఇస్తే పుస్తకం గౌరవం తగ్గిపోతుంది. అందుకే విక్రయాలను మంచి పనికి విరాళంగా ఇవ్వాలనుకున్నాను.

■ **అంజిరెడ్డి (డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్ వ్యవస్థాపకులు)గారు చెప్పినట్లుగా మన కుండ నిండిన తర్వాత, అదనంగా వచ్చి పడుతున్న నీటిని మరొకరికి ఉపయోగపడేలా చేయాలి అనే సూత్రాన్ని పాటిస్తున్నారా? ఆయన నుంచి అలాగే మీ నాన్నగారి నుంచి మీరు నేర్చుకున్నదేమిటి?**

మా నాన్నగారు (గ్రీన్ పార్క్ హోటల్ వ్యవస్థాపకులు) చాలా డీటెయిల్ ఓరియెంటెడ్. మనం చేస్తున్న పని గురించి సూక్ష్మ స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని చెబుతారు. వివరాలన్నీ సమగ్రంగా తెలుసుకున్న తర్వాతే మాట్లాడేవారు. మా మామగారు (అంజిరెడ్డి) విజన్ చాలా విస్తృతమైనది. వారిద్దరినీ ఒకే 'ఫ్రేమ్'లో చెప్పాలంటే... 'అడవి అందులో చెట్లు' అని చెప్పవచ్చు. అంజిరెడ్డి గారి ద్వారా అడవిని చూస్తే, మా నాన్న గారి ద్వారా అందులో వృక్షాలను చూశాను.

■ **పాఠకులకు మీరు ఇచ్చే సందేశం ఏమిటి?**

'ప్రపంచంలోని ప్రతిదీ ప్రకృతితో ముడిపడి ఉంటుంది. మన ఆరోగ్యం అడవి ఆరోగ్యంతో ముడిపడి ఉంది. మన శ్రేయస్సు కోసం ప్రకృతి పరిరక్షణ తప్పనిసరి' అని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి. ప్రతి ఒక్కరూ 'కొంతవరకైనా ప్రకృతితో మమేకమవుదాం' అనుకుంటే... ప్రకృతి పరిరక్షణ కోసం చేయగలిగిన చిన్న చిన్న పనులు అందరమూ చేయగలుగుతాం.

ఇంటర్వ్యూ: వాకా మంజులారెడ్డి